# సామ్రాజ్యం సాధింపు

సామ్రాజ్యం కాపురానికొచ్చి ఆర్నెల్లయ్యింది.

మొదటి నెలంతా సుబ్బారావుకి జీవితమంతా విశ్వనాథ్ డైరెక్షన్‌లో సినిమా చూసినట్లే గడిచింది. తామిద్దరూ ఈ ప్రపంచానికి అతీతంగా, ఉన్నతంగా వుండే వ్యక్తులమనే భావన వుండేది.

"డియర్ సుబ్బూ, నీ స్పర్శ కోసం నా అణువణువు తపిస్తూనే వుంది. నీ రాకకోసం చంద్రుని కోసం ఎదురుచూసే చకోరంలా గృహ ప్రాంగణంలో ఎదురు చూస్తుంటాను. ఆఫీసు, ఉద్యోగం ప్రాపంచిక విషయాలు. కాని, మన ప్రేమ చాలా అమూల్యమైనది. అపురూపమైనది" అనేది సామ్రాజ్యం.

సుబ్బారావు, సామ్రాజ్యం ప్రేమికులై, తర్వాత దంపతులయ్యారు. "రాజ్యం! నీ కోసం నా జీవితం సర్వస్వం త్యాగం చేయగలను. ఆఫ్టరాల్ ఈ బోడి ఉద్యోగం ఒక లెక్కా!" అనేవాడు సుబ్బారావు.

"ఆ విషయం నాకు తెలుసు సుబ్బూ! కాని, ఈ శరీరానికి కొన్ని అవసరాలుండి, వాటి కోసం డబ్బు కావలసి, డబ్బు కోసం ఉద్యోగం తప్పనిసరైంది. లేదా, నిన్ను అనుక్షణం నా దగ్గరే వుంచుకొని ప్రేమ సామ్రాజ్యంలో తేలిపోయేదాన్ని" అనేది మత్తుగా. సుబ్బారావు విరహవేదనతో ఆఫీసుకు వెళ్ళేవాడు.

రెండు నెలలు గడిచాయి.

సుబ్బారావు ఇంటి కెదురుగా అప్పారావు, అనసూయ దంపతులు దిగేరు. వారిదీ కొత్త జంటే. బాగా హుషారుగా వుండేవారు. ఎక్కడికి వెళ్ళాలన్నా కూడా జంటగా వెళ్ళేవారు.

సామ్రాజ్యం అనసూయతో స్నేహం చేసింది.

"మా వారు ఇంద్రుడు, చంద్రుడు" అని చెప్పింది సామ్రాజ్యం.

"మా వారు గవాస్కర్, అమితాబ్ బచ్చన్, రాజీవ్ గాంధి" అంది అనసూయ. ఆ అతిశయోక్తికి కడుపు మండింది సామ్రాజ్యానికి.

"మా వారు నేనెంత చెబితే అంత. నిల్చోమంటే నిల్చుంటారు. కూర్చోమంటే కూర్చొంటారు" అంది గర్వంగా.

"మావారికి చెప్పే పనే లేదు. నా కనుసన్నల్లో నడుచుకొంటారు. ఇదిగో, "ప్రేమసాగరం" సినిమా చూస్తూ హీరోయిన్ చీర బాగుందన్నాను. అంతే, ఉదయాన్నే అలాటి చీర తీసుకొచ్చారు. చూడండి" అంటూ తను కట్టుకొన్న చీరె చూపించింది. నిజమే. చీర చాలా బాగుంది.

ఆ సాయంకాలం సామ్రాజ్యం సినిమా ప్రోగ్రాం పెట్టింది. ఆఫీసర్‌తో చీవాట్లు తిని ఇంటికొచ్చిన సుబ్బారావుకి 'మూడ్' లేదు. అయినా, భార్య కోసం బయల్దేరాడు.

ఎక్కడ హీరోయిన్ అందమైన చీరతో కన్పిస్తుందా అని ఎదురుచూసింది సామ్రాజ్యం. ఆ సీను రానే వచ్చింది.


"సుబ్బూ, ఆ చీరె ఎంత బాగుంది" అంటూ ఓరగా చూసింది సామ్రాజ్యం.

"నిజమే. ఆ చీరలో హీరోయిన్ చాలా బాగుంది" అన్నాడు సుబ్బారావు.

ఈ సమాధానం విన్నవెంటనే కోపంతో మండిపడింది సామ్రాజ్యం.

"ఛీ ఛీ! అన్నీ వెధవ బుద్ధులే. భార్యతో సినిమాకు వచ్చి పరాయి ఆడదాని అందాలు మెచ్చుకోవడం నీలాటివాడికే చెల్లింది" అంది.

"సారీ డియర్! నా ఉద్దేశం అది కాదు. అంద విహీనంగా వుండే హీరోయినే ఆ చీరలో బాగుంది. ఇక నువ్వయితే ఎంత బాగుంటావోనని ..." అన్నాడు.



సామ్రాజ్యం గర్వంగా చూసి ప్రేమతో సుబ్బారావు బుగ్గ గిల్లింది.

"మరీ ట్యూబ్‌లైట్ బుర్ర. చీర బాగుంది అని పెళ్ళాం అంటే అర్థం ఏమిటి? పక్కింటి అప్పారావు నయం. మర్నాడే చీరతో యింటికొచ్చాడు" అంది.

సుబ్బారావుకి రోషం వచ్చింది.

"రాజ్యం సినిమా చూస్తూండు. ఇప్పుడే వస్తాను" అని ఆంజనేయుడి ఫోజులో ఒక్క గెంతుగెంతి 'పి.టి. ఉష' లా రన్ చేశాడు.

సామ్రాజ్యం బద్ధకంగా ఆవలించింది, కళ్ళు నలుపుకొంది.

**జి. పద్మినీప్రసాద్**

ఎదురుగా సుబ్బారావు చీరె పేకెట్‌తో నిల్చున్నాడు.

సినిమాహాలు కాకపోతే సుబ్బారావు సామ్రాజ్యం ప్రేమగుర్తులతో మునిగి ఉక్కిరిబిక్కిరయ్యేవాడు.

నెలలు గడుస్తున్నాయి!

కాని, సామ్రాజ్యానికి అనసూయ పోటీ నెగ్గడం కష్టమైపోయింది. మాటలతో గెలవలేకపోతూంది. అప్పారావు భార్యకు చేసే సత్కారాలు చూస్తూంటే ఆవేశం పెరిగిపోతూంది.

"నిన్న సాయంకాలం స్నేహితురాలి కొడుకు పుట్టినరోజని వెళ్ళాం. అబ్బ, వాళ్ళింట్లో టి.వి. చూశాక నాకు రాత్రి నిద్దరేపట్టలేదు. ఒక రాత్రి మెలకువ వచ్చి మావారు నన్ను చూసి కంగారుపడి 'అదేమిటి, ఇంకా పడుకోలేదా' అన్నారు. 'టి.వి. బాగుంది కదండీ!' అన్నాను.

'అదా సంగతి. నేను వున్నానుగా. నీ కోరిక తీరినట్లే పడుకో' అన్నారు. ... అరే మాటల్లోనే వస్తున్నారు. ఏమిటబ్బా ఆటోలోంచి పార్సెల్ దించుతున్నారు! ఇంకేముంది టి.వి. తెచ్చారు కాబోలు. నే వస్తా సామ్రాజ్యంగారూ" అంటూ ఒయ్యారంగా వెళ్ళిపోయింది.

నిజమే అప్పారావు టి.వి. తెచ్చేడు.

సామ్రాజ్యం కుతకుత ఉడికిపోయింది.

"సుబ్బూ!" అంటూ ఒక్కసారి కోపంతో అరిచింది.

ఆఫీసులో పనిచేసుకొంటున్న సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. వెంటనే లేచి ఆఫీసర్ దగ్గరకు పోయి "సార్, మా ఆవిడకు ఆరోగ్యం బాగులేదు. పర్మిషన్ కావాలి"

అన్నాడు.

అప్పుడే ఫోన్‌లో తన భార్యామణి నుంచి తీయటి ముద్దు అందుకొన్న 'ఆఫీసరుడు' ఆ మైకంలో వుండే ముసిముసిగా నవ్వుతూ "పోవోయ్, ఇంటికేగా!" అన్నాడు. వెంటనే సుబ్బారావు మాయమయ్యాడు.

*    *    *

ఆ వీథిలో ఒక వింత సంచలనం కలిగింది. అనసూయ ఏది కొంటే సామ్రాజ్యం అది కొంటుంది. కూరగాయలవాళ్ళ దగ్గర్నుండి కుంటి ముష్టివాడి వరకూ వీళ్ళ సంగతి గమనించి ఇద్దరికీ పోటీపెట్టి తాము లాభపడడం ప్రారంభించారు.

చిల్లర సరుకులు అమ్ముకొనేవాళ్ళు కూడా ఎవరైనా బేరమాడితే "అదేంటమ్మా! ఎదురింటావిడ ఎంత చెబితే అంతే. మీలా బేరాలుండవు" అనడం, తమ సరుకులు అమ్ముకోవడం నేర్చారు.

ఈ పోటీలో నిత్య ఉద్రేకంతో బుసలు కొట్టేది సామ్రాజ్యం, అనసూయ! నిత్య దరిద్రంతో నీరసించి పోయేది సుబ్బారావు, అప్పారావు.

సామ్రాజ్యం ఈ పోటీని అధిగమించాలనుకొంది. సుబ్బారావు మీద 'వార్' డిక్లేర్ చేసింది. చేంతాడంత లిస్ట్ ఇచ్చింది. ఇవన్నీ ఇంట్లో వుండాలంది. లేకపోతే 'ప్రిస్టేజి' పోయినట్లే నంది. కల్లుతాగిన కోతిలా గెంతింది.

"రాజ్యం! ఇవన్నీ ఎందుకు? నెమ్మదిగా కొనుక్కొందాం" అన్నాడు.




"టాక్! వీల్లేదు. దాని మొగుడు ముందు తేవడం. తర్వాత మనం కొనడం. ఇది కుదరదు. ముందే మనం అన్నీ కొనేయాలి."

"చాలా కొన్నాం గదా! ఇంకెందుకు చెప్పు. ఐనా వాళ్ళతో పోటీ ఏమిటి? వాళ్ళ పద్ధతి వాళ్ళది. మన పద్ధతి మనది."

"సుబ్బూ! చవటలా మాట్లాడకు! వాళ్ళేం చేస్తే అదే చెయ్యాలి. వాళ్ళకన్నా ఒకడుగు ముందే వుండాలి. గో, వెంటనే పని కానీ." అంది సామ్రాజ్యం.

వడినెత్తిన సూర్యుడు విశ్వరూపం చూపిస్తూంటే 'ఉస్సు'రంటూ వీథిన పడ్డాడు సుబ్బారావు. కొంత దూరం నడిచి చూస్తే తనలాగే 'ఉసురో' మంటూ వస్తున్న అప్పారావు కనిపించాడు.

ఒకర్ని చూసి ఒకరు బావురుమన్నారు.

కావలించుకొని ఘొల్లుమన్నారు.

బాధను తట్టుకోవడం కోసం బార్‌కి వెళ్ళారు.

*    *    *

"మీకేమైనా మతిపోయిందా. తాగొస్తారా. ఛీ ఛీ!" అంది సామ్రాజ్యం.

"డియర్, ఆ మాటంటే నేను పడను. ఎదురింటి అప్పారావు తాగుతూంటే నేనేనా చేతకాని వాణ్ణి. నేనూ తాగేను. లేకపోతే నీ ప్రిస్టేజ్ ఏమయ్యేది?" విన్ను చూసి వాళ్ళు నవ్వేవారు కాదూ!" అన్నాడు.

సామ్రాజ్యం నెత్తి బాదుకొంది.

"వాళ్ళతో మనకు పోటీనా! వాళ్ళు చేసే వెధవ పన్లు మీరు చేస్తారా? ఇది చచ్చినా సహించను" అంది రోషంతో.

"అంతే. ఈ రోజు నుంచి నువ్వు, నేనూ కూడా వాళ్ళు చేసే వెధవ పన్లు చెయ్యొద్దు. సరేనా" అన్నాడు గుడ్లు పెద్దవి చేస్తూ.

సామ్రాజ్యం సరేనక తప్పలేదు. ●

